ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

శుక్రవారం 24 అక్టోబరు 2025

వైకల్యాన్ని జయించి.. ఆత్మవిశ్వాసంతో సాగుతూ

● ఆదర్శం.. రాంబాబు ప్రయాణం

● నేడు ప్రపంచ పోలియో నివారణ దినం

6లో



రైతుల్లో అలజడి

● మారిన వాతావరణం

● కమ్మేసిన మేఘాలు.. పలుచోట్ల వర్షాలు

● పంటలపై అన్నదాతల్లో ఆందోళన



మక్కువరూరల్: ఎస్.పెద్దవలసలో వర్షాలకు నేలకొరిగిన మొక్కజొన్న పంట



కోతకు సిద్ధంగా ఉన్న పత్తి పంట



పాలకొండలో కురుస్తున్న వర్షం

పాలకొండ/మక్కువరూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం కారణంగా జిల్లాలో ఒక్కసారిగా వాతావరణం మారింది. గురువారం ఉదయం నుంచే ఆకాశంలో మేఘాలు దట్టంగా కమ్ముకున్నాయి. పలుచోట్ల వర్షాలు పడుతున్నాయి. మక్కువ మండలంలోని శంబర, దుగ్గేరు, వెంకటభైరిపురం, మార్కొండపుట్టి, ఎస్.పెద్దవలస, చెముడు, దబ్బగెడ్డ తదితర ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. ఎస్.పెద్దవలసలో మొక్కజొన్న పంట నేలకొరిగింది. పాలకొండ మండలంలో కూడా వానలు పడ్డాయి. ఇప్పుడిప్పుడే చేతికి పంట అందుతున్న సమయంలో వరుణుడు ప్రతాపం చూపుతుండడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో సుమారు 4 లక్షల ఎకరాల్లో వరి, పత్తి, ఇతర వాణిజ్యపంటలను రైతులు సాగు చేస్తున్నారు. తేలికపాటి వరి రకాలు ఇప్పటికే కోత దశకు చేరుకున్నాయి. పత్తి పంట కూడా చేతికందడంతో చాలాకోట్ల కోతలు కోసి బస్తాల్లో నిల్వ ఉంచారు. ఈ సమయంలో భారీ వర్షాలు కురిస్తే వరి, పత్తి తదితర పంటలు నేలకొరిగి పూర్తిగా దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.



పాలకొండలో కోత దశకు చేరుకున్న వరి

హమ్మయ్య.. ఊపిరి పీల్చుకోవచ్చు

● పార్వతీపురం పట్టణ ప్రజలకు తప్పనున్న కంపు బాధ

● డంపింగ్ యార్డులో చెత్త రీసైక్లింగ్‌కు చర్యలు

● నాలుగైదు రోజుల్లో ప్రారంభంకానున్న ప్రక్రియ



డంపింగ్ యార్డు వద్ద ఏర్పాటు చేసిన చెత్త రీ సైక్లింగ్ మిషన్

పార్వతీపురంటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పార్వతీపురంలో డంపింగ్ యార్డు సమస్య త్వరలో పరిష్కారం కానుంది. ఈమేరకు స్వచ్ఛాంధ్ర సహకారంతో తరుణ్ అసోసియేట్స్ ఆధ్వర్యంలో డంపింగ్ యార్డులోని పొడి, చెత్తను వేరు చేసే ప్రక్రియ మరో నాలుగైదు రోజుల్లో ప్రారంభంకానుంది. ఇప్పటికే డంపింగ్ యార్డు వద్ద రీసైక్లింగ్ మిషన్‌ను ఏర్పాటు చేశారు. దీంతో పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తప్పనున్న ఇబ్బందులు

జిల్లా కేంద్రంలోని రాయగడ అంతర్రాష్ట్ర రోడ్డు శివారులో ఉన్న డంపింగ్ యార్డుతో పార్వతీపురం పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యార్డు నుంచి వస్తోన్న తీవ్ర దుర్వాసనతో పాదచారులు, వాహనచోదకులు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. డంపింగ్ (మిగతా 8వ పేజీలో..)

డోలీ మోతలు తప్పేలా.. అంబులెన్స్‌లు వెళ్లేలా..

● ప్రతి గిరిజన గ్రామానికీ రోడ్డు

● 108 వాహనం వెళ్లే విధంగా నిర్మాణాలు

● జిల్లాలో మొదటి విడతగా 83 రహదారులకు నిధులు





కొమరాడ మండలం పూడేసు పంచాయతీ గుమడింగికి చెందిన రోగిని మోసుకుంటూ కొండ దిగుతున్న గిరిజనులు(ఫైల్)

పార్వతీపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రధానంగా డోలీల మోత లేకుండా చేయడం.. ప్రతి గిరిజన గూడకూ అంబులెన్స్ వెళ్లేలా రహదారి సౌకర్యం కల్పించాలనే లక్ష్యంగా పని చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలో మొదటి విడతగా 83 రహదారులు నిర్మించాలని నిర్ణయించింది. అవసరమైన చోట్ల కల్వర్టులు సైతం ఏర్పాటు చేయనుంది. గత ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.200 కోట్లకు పైబడి నిధులతో గిరిజన గ్రామాలకు బీటీ రహదారులు నిర్మిస్తున్నారు. భవిష్యత్‌లో పక్కా రోడ్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, నిధులు పూర్తిస్థాయిలో మంజూరయ్యే వరకూ ఆయా గ్రామాలకు కనీసం అంబులెన్స్ వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కొమరాడ (మిగతా 8వ పేజీలో..)

ఇంకా బడికి రావట్లే!

● కురుపాం గురుకుల బాలికల పాఠశాల పునఃప్రారంభమై వారం దాటిన వైనం

● 609 మందికి 16 మంది విద్యార్థినులే హాజరు

● వీడని పచ్చకామెర్ల భయం



కురుపాం గురుకుల పాఠశాల

కురుపాం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కురుపాం గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినుల్లో ఇంకా పచ్చకామెర్ల వ్యాధి భయంపోనట్లు ఉంది. పాఠశాల పునఃప్రారంభమై వారం గడిచినా ఇంకా తరగతులకు హాజరుకావడం లేదు. దసరా సెలవుల్లో తీవ్రమైన జాండిస్‌తో పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు మృతి చెందగా, మరికొందరు ఆస్పత్రుల్లో చేరి చికిత్స పొంది కోలుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పాఠశాలకు దసరా నుంచి ఈ నెల 15 వరకు అధికారులు సెలవులను ప్రకటించారు. ఈ నెల 16న పాఠశాలను పునఃప్రారంభించారు. పాఠశాల సిబ్బంది అన్ని గ్రామాలకు వెళ్లి విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను బడికి పంపించాలని కోరారు. ఈ పాఠశాలలో మొత్తం 609 మంది విద్యార్థినులు ఉన్నారు. అయినప్పటికీ ఎవరూ తరగతులకు రావడం లేదు. ఈ నెల 19న కేవలం 31 మందే హాజరు కాగా, దీపావళి కారణంగా వీరిలో సగం మంది ఇళ్లకు వెళ్లిపోయారు. ప్రస్తుతం పాఠశాలలో కేవలం 16 మంది విద్యార్థినులు మాత్రమే ఉన్నారు. దీంతో అకడమిక్ పరంగా విద్యార్థినులు నష్టపోతున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విజయలక్ష్మిని వివరణ కోరగా.. తమ సిబ్బంది, ఉపాధ్యాయులు అన్ని గ్రామాలకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాతున్నారని, నాగుల చవితి పండుగ తరువాత పిల్లలను పంపిస్తామని వారు చెబుతున్నారని అన్నారు.

కల్తీ మద్యం పాపం జగన్‌దే

● మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం పాపం జగన్‌దేనని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. గురువారం సాలూరులో ఆమె విలేకరులతో మాట్లాడారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అంతటా కల్తీ మద్యం ఏరులై పారిందని, అది తాగి వేలాది మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. 'జగన్ హయాంలో జేబ్రాండ్ పేరుతో కల్తీ మద్యం విచ్చలవిడిగా విక్రయించారు. ఆ మద్యం తాగి 30 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. 30లక్షల మంది అనారోగ్యానికి గురయ్యారు. కల్తీ మద్యాన్ని అధిక ధరలకు విక్రయించి రూ.3,500 కోట్లు దోచుకున్నారు. కల్తీ మద్యం తయారీ, అమ్మకాలపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. జగన్ హయాంలో మూడు లక్షలకుపైగా బెల్టుషాపుల ఉండగా అవన్నీ మూయించాం. బెల్టు షాపు నిర్వహిస్తే రూ.5 లక్షల జరిమానా విధిస్తున్నాం. మొలకల చెరువు మద్యం తయారీ ఘటనపై ఐదుగురు ఐపీఎస్ అధికారులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేశాం. త్వరలోనే వాస్తవాలను (మిగతా 8వ పేజీలో..)

కార్తీక మాసంలో ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు

పార్వతీపురంటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు నడపనున్నట్లు పార్వతీపురం ఆర్టీసీ డిపో మేనేజర్ లక్ష్మణరావు తెలిపారు. గురువారం స్థానిక డిపో కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలోని సంగం, నారాయణపురం, అడ్డాపుశీల, చోళ్లపదం, తోటపల్లి పుణ్యక్షేత్రాల సందర్శన కోసం అల్ట్రా డీలక్స్ బస్సులను నడపనున్నట్లు చెప్పారు. ప్రతీ సోమవారం (అక్టోబరు 27, నవంబరు 3, 10, 17 తేదీలు) ఉదయం 6 గంటలకు పార్వతీపురం స్టేషన్ నుంచి ఈ బస్సులు బయలుదేరి సాయంత్రం 6 గంటలకు తిరిగి వస్తాయన్నారు. ఒక్కో వ్యక్తికి టిక్కెట్ చార్జీ రూ.550 మాత్రమే అన్నారు. అలాగే పంచారామాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట వంటి పురాతన పుణ్య క్షేత్రాలను ఒక్కరోజులోనే చూపించడం జరుగుతుందన్నారు. ప్రతి ఆదివారం పార్వతీపురం స్టేషన్‌లో సాయంత్రం 3 గంటలకు బస్సు లు బయలుదేరి, సోమవారం పుణ్యక్షేత్రాల దర్శించుకొని, మంగళవారం ఉదయం 8గంటలకు తిరిగి చేరుకుంటాయన్నారు. ఒక్కో వ్యక్తికి టిక్కెట్ చార్జీ రూ.2,500 అని చెప్పారు. శబరిమల యాత్రకు వెళ్లే స్వాముల కోసం వారు కోరిన క్షేత్రాలను చూపించేందుకు అల్ట్రా డీలక్స్ బస్సు సర్వీసులను నడపనున్నట్లు తెలిపారు. వివరాల కోసం 9492022386, 7382920873, 9959225621 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలి

● గిరిజనులకు ఉపాధి కల్పించాలి

● కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

పార్వతీపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చారిత్రక, పర్యాటక ప్రాంతాలను అధికారులు గుర్తించి వాటిని అభివృద్ధి చేయాలని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, ఇంజనీరింగ్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆదికర్మ యోగి పథకంలో భాగంగా స్థానిక గిరిజనులతో కలిసి పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసి వారికి ఉపాధి కల్పించాలన్నారు. డోలీ మోతలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. రోడ్లు లేని గ్రామాలను గుర్తించి అవసరమైన మేరకు సర్వే చేసి మంజూరు అనుమతులు పొందాలన్నారు. రోడ్లు (మిగతా 8వ పేజీలో..)

వైసీపీ పాలనలో లిక్కర్ మాఫియా

● ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి



మాట్లాడుతున్న జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం ఫార్ములా తాడేపల్లి ప్యాలెస్‌లోనే తయారు చేశారని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అన్నారు. తమ అవినీతి, అక్రమాలు, పాపాలను ఎదుటవారిపై నెట్టడంలో జగన్ అండ్ కో పీహెచ్‌డీ చేశారని విమర్శించారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. గత ఐదేళ్లు వైసీపీ లిక్కర్ మాఫియా నడిపి రూ.3,500 కోట్లు దోచుకుందన్నారు. ఈ విషయంలో ప్రజల దృష్టిని మళ్లించడానికి జగన్ కుట్రలకు ప్లాన్ చేశారన్నారు. అందులో భాగంగానే చిత్తూరు జిల్లా ములకలచెరువు, ఇబ్రహీంపట్నం నకిలీ మద్యం అంశం అన్నారు. కుట్రపూరితంగానే కల్తీ మద్యం ఫార్ములాను తాడేపల్లి ప్యాలెస్‌లో తయారు చేశారన్నారు. సెప్టెంబరు 2న ఆఫ్రికాకు వెళ్లేందుకు టిక్కెట్ బుక్ చేసుకున్న జనార్దనరావును 23న జోగి రమేష్ ఇంటికి పిలిపించుకున్నారన్నారు. జోగి రమేష్ చిన్ననాటి స్నేహితులు కావడంతో నకిలీ మద్యానికి పక్క ప్రణాళికలు రచించారన్నారు. మద్యం తయారీ కంపెలన్నింటినీ జగన్ గుప్పిట్లో పెట్టుకొని జే బ్రాండ్లు తయారు చేశారన్నారు. దీనివల్ల రాష్ట్రంలో 30వేల మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు.

వి'నూతనం'గా పైప్‌లైన్

● పెద్దగెడ్డ ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో త్వరలో ఏర్పాటు

● ఎం.క్యాడ్ పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక



పెద్దగెడ్డ ప్రాజెక్టు

బొబ్బిలి/ పాచిపెంట/రామభద్రపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో ఉన్న పాచిపెంట మండలంలోని పెద్దగెడ్డ ప్రాజెక్టులో ఆయకట్టుదారులకు సాగునీటి తిప్పలు తప్పనున్నాయి. 3061 హెక్టార్లకు సాగునీరందిస్తున్న ఈ ప్రాజెక్టులో ఎంక్యాడ్ (మోడర్నైజేషన్ ఆఫ్ కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్) పనులు చేపట్టేందుకు కేంద్రం పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసింది. రూ.74 కోట్లతో అధునాతన పైప్‌లైన్ పనులను ప్రయోగాత్మకంగా చేపట్టనున్నారు. దేశంలోనే మొదటిసారి ఈ తరహా పనులను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించడం.. ఆ అవకాశం పెద్దగెడ్డకు దక్కడం మరింత విశేషం. పంట కాలువలకు ప్రత్యామ్నాయంగా భూగర్భ పైపులైన్ల ద్వారా ఆయకట్టు భూములకు సాగునీరందిస్తారు.

● కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వాటా నిధులతో పంట కాలువలకు ప్రత్యామ్నాయంగా భూగర్భ పైపులైన్ల ద్వారా ఆయకట్టు (మిగతా 8వ పేజీలో..)

రైల్వే గేటు సమస్యలకు మోక్షం

● మూడుచోట్ల వంతెనల నిర్మాణం ● సర్వే చేపడుతున్న అధికారులు

● త్వరలో ట్రాఫిక్ చిక్కులకు పరిష్కారం

6లో

యువ కళాకారులకు ప్రోత్సాహం

● సెట్విజ్ సీఈవో వెంకటేశ్వరరావు ● సందడిగా యువజనోత్సవాలు

6లో

రైల్వే గేటు సమస్యలకు మోక్షం

- మూడుచోట్ల వంతెనల నిర్మాణం
- సర్వే చేపడుతున్న అధికారులు
- త్వరలో ట్రాఫిక్ చిక్కులకు పరిష్కారం


మెంటాడ గేటు వద్ద నిలిచిన వాహనాలు

గజపతినగరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి)

రైల్వే గేట్లు..ఏళ్ల తరబడి నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్యలకు కారణమవుతున్నాయి. వీటి కారణంగా గంటల తరబడి ట్రాఫిక్ స్తంభిస్తోంది. ప్రస్తుతం మూడో లైన్ నిర్మాణ పనులు జరుగుతుండడంతో సమస్య మరింత తీవ్రంగా మారింది. రైలు వస్తే సుమారు అర గంట పాటు వాహనాలు గేటుకు ఇరువైపులా నిలిచి పోయే పరిస్థితి ఉంటోంది. అత్యవసర సమయాల్లో 108 వాహనం కూడా నిలిచిపోవాల్సిందే. గత టీడీపీ హయాంలో స్థానిక మెంటాడ రైల్వే గేటు వద్ద అండర్ బ్రిడ్జికి నిధులు మంజూరు చేయాలని రైల్వే శాఖ ను కోరారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిపై ఒత్తిడి తీసుకురాకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మిగిలిపోయింది. ప్రస్తుతం మూడో రైల్వే లైన్ పనులు జరుగుతుండడంతో రైల్వే అధికారులు కదిలారు. రైల్వే గేట్లు ఉన్న చోట ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వంతెనల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి మండలాల్లోని రైల్వే గేట్ల వద్ద ఆర్‌వోబీల నిర్మాణానికి ప్రతిపాదించారు. గజపతినగరం మండలంలోని మెంటాడ రైల్వే గేటు వద్ద నిరంతరం ట్రాఫిక్ సమస్య వెంటాడుతోంది. ఈ మార్గంలో గజపతినగరం, మెంటాడ మండలాలకు చెందిన సుమారు 50 గ్రామాల ప్రజలు, వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. దత్తిరాజేరు మండలం కోమటిపల్లి రైల్వే గేటు వైపు దత్తిరాజేరు, మెంటాడ, మెరకముడిదాం, రాజాం మండలాలకు చెందిన ప్రజలు వెళుతుంటారు. బొండపల్లి మండలం కనిమెరక రైల్వే గేటు నుంచి గజపతినగరం, బొండపల్లి, గంట్యాడ మండలాలకు చెందిన ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ఆర్వోబీలు పూర్తయితే వీరందరికీ ట్రాఫిక్ కష్టాలు తీరుతాయి.


మెంటాడ రైల్వే గేటు వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

నిధులు ఇలా..

గజపతినగరం రైల్వే గేటు వద్ద వంతెన నిర్మాణానికి రూ.46.86 కోట్లు, బొండపల్లి మండలం కనిమెరక రైల్వే గేటు వద్ద రూ.48.68 కోట్లు, దత్తిరాజేరు మండలం కోమటిపల్లి గేటు వద్ద రూ.49.36 కోట్ల వ్యయంతో వంతెన నిర్మాణం చేపట్టేందుకు నిధులు మంజూరైనట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఆర్ అండ్ బీ, రెవెన్యూ అధికారుల సాయంతో స్థల సేకరణకు సన్నాహాలు చేస్తున్నారు.

సర్వే చేపడుతున్నాం..

గజపతినగరం, బొండపల్లి, దత్తిరాజేరు మండలాల్లో గల గేట్ల వద్ద వంతెనల కోసం రైల్వే అధికారులు చర్యలు చేపడుతున్నారు. దీనికి సంబంధించిన నిధులు మంజూరయ్యాయి. రెవెన్యూ అధికారులతో కలసి సర్వే చేపట్టి.. రైల్వే అధికారులకు నివేదికను అందజేస్తాం. ప్రస్తుతం సర్వే పనులు సాగుతున్నాయి.

-అజయ్‌భార్గవ్, ఏఈ, ఆర్ అండ్ బి



వెంగళరాయ సాగర్ నీరు విడుదల

మక్కువ రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శంబర సమీపాన గల వెంగళరాయసాగర్ ప్రాజెక్టు నుంచి 300 క్యూసెక్కుల నీటిని సువర్ణముఖి నదిలోకి గురువారం రాత్రి 9 గంటల ప్రాంతంలో విడిచిపెట్టారు. అల్పపీడనం కారణంగా సువర్ణముఖి నదీ పరీవాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వెంగళరాయ సాగర్ జలాశయంలోకి సామర్థ్యానికి మించి వరద నీరు చేరుతోంది. దీంతో మిగులు జలాలను నదిలోకి విడిచిపెడుతున్నామని ఏఈ రాజశేఖర్ గురువారం రాత్రి విలేకరులకు తెలిపారు.

నకిలీ మద్యం అమ్మకాలపై ఉక్కుపాదం

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల్లో నకిలీ మద్యం అమ్మకాలు చేపడితే ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హెచ్చరించారు. ఇటీవల ప్రభుత్వం తీసుకువచ్చిన ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌తో పట్టణంలోని మోహన్ మద్యం షాపులో మద్యం సీసాలను గురువారం స్కాన్ చేశారు. వాటి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నకిలీ మద్యం అమ్మకాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్టు తెలిపారు. పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేస్తున్నట్టు వివరించారు. గత ప్రభుత్వం నాశిరకం మద్యాన్ని తీసుకువచ్చి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడిందని వివరించారు. బెవరేజెస్ నుంచి గొడౌన్‌లకు వెళ్లకుండా నేరుగా మద్యం షాపులకు తరలించి భారీ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ప్రతి పక్షాల ఆరోపణలు తిప్పి కొట్టాలని శ్రేణులకు సూచించారు. అనంతరం సీతారామస్వామి గ్రూపు దేవాయలంలో సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ జనార్దనరావు, పీఏసీఎస్ చైర్మన్ లెంక బంగారునాయుడు, మాజీ జెడ్పీటీసీ మక్కువ శ్రీధర్, ప్రదీప్ కుమార్, గ్రామ సర్పంచ్ నరవ కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.


మద్యం సీసాలపై స్కాన్ చేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ఏడాదిలో మర్రివలస వంతెన పూర్తి..

విజయనగరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏడాదిలో మర్రివలస వంతెన పూర్తి చేస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల ఒకటో తేదీన దత్తిరాజేరు మండలం దత్తి గ్రామంలో పింఛన్ల పండుగకు హాజరైన సీఎం చంద్రబాబు దృష్టికి వంతెన సమస్యను మంత్రి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన సీఎం అవసరమైన నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. వరద ముంపు తగ్గు ముఖం పట్టిన తరువాత వచ్చే ఏడాది ఫిబ్రవరిలో వంతెన నిర్మాణ పనులకు టెండర్లు పిలుస్తామని గురువారం విలేకరులకు తెలిపారు. ఏడాదిలోగా దీన్ని పూర్తి చేస్తామని చెప్పారు.

రామతీర్థం హుండీ ఆదాయం రూ.28.66 లక్షలు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

నెల్లిమర్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి దేవాలయంలో గురువారం హుండీలను లెక్కించారు. సుమారు 150 రోజుల తర్వాత తెరిచిన హుండీల ద్వారా రూ.28లక్షల 66వేల 257 ఆదాయం వచ్చినట్లు ఈవో వై.శ్రీనివాస రావు తెలిపారు. దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష పర్యవేక్షణలో ఈ లెక్కింపు చేపట్టారు. ఈ కార్యక్రమంలో విజయనగరం ఇన్‌స్పెక్టర్ జి.శ్యామ్‌ప్రసాద్, కొట్టాం దేవస్థానం కార్యనిర్వహణాధికారి జి.శ్రీనివాస్, బొబ్బిలి వేణుగోపాలస్వామివారి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి సీహెచ్‌టీవీఆర్ లక్ష్మణరావు, నెల్లిమర్ల పోలీసు సిబ్బంది, రామతీర్థం గ్రామ సచివాలయం సిబ్బంది శ్రీహరి, సేవా సంఘం సభ్యులు, రామతీర్థం గ్రామీణ బ్యాంకు సిబ్బంది, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైకల్యాన్ని జయించి.. ఆత్మవిశ్వాసంతో సాగుతూ..

- ఆదర్శం.. రాంబాబు ప్రయాణం
- నేడు ప్రపంచ పోలియో నివారణ దినం

బొబ్బిలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలియో మహమ్మారి ఎంతో మంది జీవితాలను కకావికలం చేసింది. తోటి పిల్లలతో ఆడి పాడే వయస్సులో పోలియో వ్యాధి సోకితే ఆ చిన్నారుల పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో ఊహించవచ్చు. ఇలాంటి వారు అంగవికలురుగా మిగిలిపోతున్నారు. ఏ పనీ చేయలేక.. ఇతరులపై ఆధారపడి బతుకు బండి లాగుతున్న వారు ఎందరో. దీనికి భిన్నంగా కొండంత ఆత్మవిశ్వాసంతో వైకల్యాన్ని జయించి... ముందుకు సాగుతూ... ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న వారూ ఉన్నారు. ఆ కోవకే చెందుతాడు బొబ్బిలి పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన చీమల రాంబాబు (39). మూడు నెలల ప్రాయంలోనే ఆయనకు పోలియో సోకింది. అప్పట్లో తల్లిదండ్రులకు సరైన అవగాహన లేకపోవడం... సకాలంలో వైద్యం అందని కారణంగా రాంబాబు కుడి కాలు, ఎడమ చేయి చచ్చుబడిపోయాయి. అయితే ఊహ తెలిసినప్పటి నుంచి రాంబాబు


చీమల రాంబాబు

తన వైకల్యాన్ని తలచుకొని కుంగిపోవడం మానేశాడు. అందరిలాగానే చదువుకోవాలని.. ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించాలని సంకల్పించాడు. ఇప్పటికీ ఆ ప్రయత్నంలోనే ఉన్నాడు. వంగర మండలం దేవకివాడ గ్రామానికి చెందిన రాంబాబుది మడ్డువలస



కుటుంబ సభ్యులతో రాంబాబు

రిజర్వాయరు నిర్వాసిత కుటుంబం కావడంతో 2010లో బొబ్బిలి పట్టణానికి వలస వచ్చారు. ఈలోగా తండ్రి చనిపోవడంతో తల్లి, చెల్లితో కలిసి ఉండేవాడు. అష్టకష్టాలు పడుతూ డిగ్రీ పూర్తి చేశాడు. పెళ్లి చేసుకున్నాడు. ఆయనకు ఇద్దరు పిల్లలు. పత్రికా కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా తన మొదటి చిరుద్యోగాన్ని ప్రారంభించాడు. ఆ తరువాత పాన్ షాపు పెట్టుకున్నాడు. రేషన్ డిపో డీలరు దగ్గర సహాయకునిగా పనిచేశాడు. ఏడేళ్ల విద్యావలంటీర్‌గా సేవలందించాడు. 2014లో స్టాంపుల విక్రేతగా లైసెన్సును పొందాడు. దీనితో గౌరవప్రదంగా జీవించగలుగుతున్నానని చెబుతున్నాడు. ప్రస్తుతం రాష్ట్ర టీడీపీ దివ్యాంగుల విభాగానికి కార్యదర్శిగానూ పని చేస్తున్నాడు. కుమార్తె ప్రత్యూష 9, కుమారుడు గౌతమ్ కుమార్ 8వ తరగతి చదువుతున్నారని రాంబాబు చెప్పాడు.

అయ్యప్పస్వామికి చక్కెరతో అభిషేకం

సాలూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామి వారికి గురువారం చక్కెరతో అభిషేకం చేశారు. దీని కోసం 400 కిలోల చక్కెరను వినియోగించారు. అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


చక్కెరతో అభిషేకం చేసిన దృశ్యం

అసలే మలుపు... ఆపై గొయ్యి!

- ప్రమాదకరంగా మారిన వైనం

సంతకవిటి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అసలే అది మలుపు. ఎదురెదురుగా వచ్చే వాహనాలు దగ్గర పడేవరకు కనిపించవు. అవతలి రోడ్డులో ఏముందో ఇవతలి వారికి తెలియదు. ఇక వర్షం వస్తే చెరువును తలపిస్తుంది. ఆ గోతిలో పడి... నిత్యం ఎవరో ఒకరు ప్రమాదాలకు గురవుతున్నారు. కొందరు తీవ్రంగా గాయపడుతున్న సంఘటనలూ ఉంటున్నాయి. ఇదీ రాజాం - సంతకవిటి ప్రధాన రహదారిలో తాలాడ గ్రామం వద్దనున్న గొయ్యి పరిస్థితి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు అది మరింత లోతుగా మారింది. దీంతో వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాల పాలవుతున్నారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు... సాయంత్రం 4 నుంచి 6 గంటల సమయంలో ఈ రహదారిలో కళాశాల బస్సులు, డెయిరీ వ్యానులు, ఆర్టీసీ బస్సులు, ఆటోలు అధికంగా తిరుగుతూ... రద్దీగా ఉంటుంది. ఆ సమయాల్లో ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఎదురెదురుగా వచ్చే వాహనాలను మలుపు వద్ద తప్పించే క్రమంలో గుంతలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. ఈ గొయ్యిని పూడ్చేందుకు కృషి చేయాలని... మలుపు వద్ద ప్రమాద సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.


మలుపులో చెరువును తలపిస్తున్న గొయ్యి

యువ కళాకారులకు ప్రోత్సాహం

- సెట్విజ్ సీఈవో వెంకటేశ్వరరావు
- సందడిగా యువజనోత్సవాలు

విజయనగరం టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): యువ కళాకారులను ప్రోత్సహించేందుకు..వారినిలోని ప్రతిభకు సాన బెట్టేందుకు ఏటా జిల్లా కేంద్రంలో యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్టు సెట్విజ్ సీఈవో, డిప్యూటీ కలెక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని సంగీత, నృత్య కళాశాలలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. యువత చదువుతో పాటు కళలను పరిరక్షించేందుకు తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కళలతో మానసిక వికాసం కలుగుతుందన్నారు. ఇలాంటి పోటీలతో విద్యార్థులు, యువతలోని ప్రతిభ వెలుగులోకి వస్తుందని చెప్పారు. నృత్యాలు, జానపద గీతాలు, కవిత్వం, పెయింటింగ్, జానపద నృత్యాలు, జానపద గీతాలు తదితర అంశాలలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. జానపద నృత్యాలలో సీహెచ్ కీర్తన, పి.తిరుపతి బృందాలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. కె.కుమారస్వామి, మాణిక్యం, మండపాక నాగలక్ష్మి, వెంకటరమణ పాల్గొన్నారు.



జానపద గీతాలు ఆలపిస్తున్న యువకులు



వివేకానందుని చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

అక్రమ కట్టడాల నిరోధంపై దృష్టి


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం టౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలో అక్రమ కట్టడాలను నిరోధించేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య ఆదేశించారు. ఇళ్ల క్రమబద్ధీకరణలో ఎక్కడా రాజీ పడే ప్రసక్తే ఉండదని తెలిపారు. గురువారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో పట్టణ ప్రణాళికా విభాగం అధికారులతో ఆయన మాట్లాడారు. నగరంలో అనుమతులు లేకుండా భవనాలు నిర్మిస్తే ఊరుకునేది లేదన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు త్వరితగతిన పరిష్కారమయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న బీపీఎల్ దరఖాస్తులను కూడా పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పరిశీలించి, అక్రమ కట్టడాలను నిరోధించాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టం చేశారు.

మద్యం నాణ్యతను తెలుసుకోండి



సురక్ష యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఎంపీ కలిశెట్టి, టీడీపీ నేత బంగార్రాజు

భోగాపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రతి మద్యం సీసాను సురక్ష యాప్ ద్వారా స్కాన్ చేసి సంబంధిత మద్యం నాణ్యమైందా.. కాదా.. అని తెలుసుకోవాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సూచించారు. గురువారం లింగాలవలస గ్రామంలోని మద్యం దుకాణం వద్ద రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజుతో కలిసి ఆయన సురక్ష యాప్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ, నాయకులు దాసరి అప్పలస్వామి, బుగత రామ్మోహన్, రీసు రమణ పాల్గొన్నారు.

నేడు ప్రజాదర్బార్

విజయనగరం రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి దాదాపు గంట పాటు ఈ కార్యక్రమం కొనసాగనుంది. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు నియోజకవర్గ ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నారు.

తరగతి గదుల ప్రారంభం..

నగర శివారులో వున్న వేణుగోపాలపురం డైట్ కళాశాలలో అదనపు తరగతి గదులను ఎమ్మెల్యే అదితి గజపతిరాజు శుక్రవారం ప్రారంభించనున్నారు. అలాగే కళాశాల చుట్టూ నిర్మించనున్న ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించనున్నారు.

ఏనుగుల సంచారం

కొమరాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆర్తంకొండ ప్రాంతంలోని ఏనుగులు గుంపు గురువారం సాయంత్రానికి సుందరాపురం, అంకుళ్లవలస గ్రామాల మధ్య పంట పొలాల్లో సంచరిస్తున్నాయి. తక్షణమే ఏనుగులు తరలించాలని రైతులు అటవీ శాఖ అధికారులను కోరారు ఇదిలా ఉండగా ఏనుగులకు కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని అటవీ అధికారులు రైతులకు సూచించారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే విద్యార్థుల మరణాలు

బెలగాం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే గిరిజన గురుకుల, ఆశ్రమ పాఠశాల విద్యార్థులు మరణిస్తున్నారని పీడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.భాస్కర్ ఆరోపించారు. గురువారం స్థానిక గిరిజన భవనంలో పీడీఎస్‌వో జిల్లా అధ్యక్షుడు కె.సోమేశ్ అధ్యక్షతన జిల్లా మహాసభలు నిర్వహించారు. మహాసభకు ముఖ్యఅతిథిగా భాస్కర్ హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 15 మంది విద్యార్థులు మృతి చెందారన్నారు. దీనికి ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. విద్యార్థుల మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, వసతిగృహాల్లో వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు మెస్ బిల్లులు పెంచి పౌష్టికాహారం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఏఎన్ఎంలను నియమించాలన్నారు. ఈ సందర్భంగా పలు విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కవి, ఉపాధ్యాయుడు సిరికి స్వామినాయుడు, ఏపీటీఎఫ్ నాయకులు బాలకృష్ణ, పీడీఎస్‌వో నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షాలపై అన్నదాతల ఆందోళన

లక్కవరపుకోట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం ఉదయం నుంచి కురుస్తున్న భారీ జల్లులు, ఈదురు గాలులకు రైతులు ఆందోళన చెందుతున్నారు. వరిపంట వెన్ను వాల్చే దశలో ఉన్నందున పంట నేలకొరుగుతుందేమోనని భయపడుతున్నారు. వర్షం ఇలాగే కొనసాగి గాలి వీస్తే పంట మొత్తం నీటమునిగే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు బాగుచేయరూ..

జామి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రామయ్యపాలెం పంచాయతీ ఎస్సీ కాలనీకి వెళ్లే రోడ్డు పూర్తిగా పాడయ్యింది. దీంతో ఆ కాలనీవాసులు గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా తమ కాలనీకి వచ్చే రోడ్డు పాడై.. నడవడానికి వీలు లేకుండా మారిందన్నారు. దీనిపై పంచాయతీ పాలకులు, అధికారులు, సిబ్బందికి తెలియజేసినా పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి తమ కష్టాలు తీర్చాలని వారు కోరుతున్నారు.



ఇదీ రామయ్యపాలెం ఎస్సీ కాలనీకి వెళ్లే రోడ్డు దుస్థితి

ట్రాఫిక్ సమస్య తీరేదెప్పుడో?

- సర్వీస్ రోడ్డుపై వాహనాల పార్కింగ్
- అవస్థలు పడుతున్న వాహనచోదకులు

భోగాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): భోగాపురంలో సర్వీస్ రోడ్డుపై ట్రాఫిక్ సమస్య తీరేదెప్పుడో అని వాహనచోదకులు ప్రశ్నిస్తున్నా రు. శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే సర్వీసు రోడ్డు నిరంతరం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఇది ప్రధాన జంక్షన్ కావడంతో ఇతర ప్రాంతాల నుంచి అధికంగా వాహనాలు రాకపోకలు సాగిస్తుం టాయి. ఈ సర్వీసు రోడ్డును అనుకుని అనేక దుకాణాలు ఉన్నాయి. దీంతో కొనుగోలుదారులు రోడ్డుపైనే వాహనాలను నిలిపేస్తున్నారు. దీంతో ఆ రోడ్డు గుండా వెళ్లాలంటే వాహన చోదకులు అవస్థలు పడాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.



భోగాపురంలో సర్వీస్ రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాలు

ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా పనిచేయండి

- డీఈవో మాణిక్యంనాయుడు

రాజాం రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధన దిశగా ఉపాధ్యాయులు పనిచేయాలని జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యంనాయుడు పిలుపునిచ్చారు. ఇప్పటినుంచే ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా పనిచేసి విద్యార్థులను పరీక్షలకు తయారుచేయాలని ఆయన స్పష్టం చేశారు. పట్టణంలోని విద్యానికేతన్ పాఠశాలలో నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు, ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలతో గురువారం ఆయన సమావేశమయ్యారు. వారికి దిశా నిర్దేశం చేశారు. నవంబరు 15 నాటికి సిలబస్ పూర్తిచేయాలని, ప్రత్యేక తరగతులు నిర్వహించడం ద్వారా రివిజన్ చేయాలని ఉపాధ్యాయులకు డీఈవో సూచించారు. గత విద్యా సంవత్సరం కంటే ఈ విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణత శాతం పెరిగేందుకు కృషి చేయాలన్నారు. ఈసందర్భంగా గో సేవా సమితి, వికాస తరంగిణి సంయుక్తంగా నిర్వహించిన వ్యాసరచన, జీఎస్టీ, డ్రాయింగ్ కాంపిటేషన్, వ్యాసరచన పోటీల్లో రాష్ట్ర స్థాయిలో 25వ ర్యాంకు సాధించిన ఎస్.భాగ్యలక్ష్మిని డీఈవో అభినందించి, మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో తోపాటు డిప్యూటీ డీఈవో కేవీ రమణ, పరీక్షల నిర్వహణాధికారి సన్యాసిరాజు, ఎంఈవోలు ప్రవీణ్‌కుమార్, ఎంవీ ప్రసాద్, దుర్గారావు, కూర్మి నాయుడు, వెంకటరావు భాస్కరరావు, శాంతికుమారి, ప్రైవేటు పాఠశాలల సంఘం నాయకుడు గట్టి పాపారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో మాణిక్యంనాయుడు

వాలీబాల్ పోటీలు ప్రారంభం

కొత్తవలస, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): దెందేరు జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్‌కు సంబంధించిన డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీలు, క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఈ పోటీలను రాష్ట్ర దాసరి సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ పీవీ రత్నాజీ, మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఈ పోటీల్లో జిల్లాలోని 11 మండలాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కొత్తవలస పీఏసీఎస్ అధ్యక్షుడు కోళ్ల వెంకటరమణ, స్కూల్ గేమ్స్ కమిటీ చైర్మన్ రమణ, జిల్లా కార్యదర్శి కె.గోపాల్, కె.కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో 20 టన్నుల పొటాష్

లక్కవరపుకోట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులకు కావాల్సిన పొటాష్ 20 టన్నులు అందుబాటులో ఉందని ఏవో వి.హరికృష్ణ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఎల్.కోట ఆర్ఎస్‌కేలో 10 టన్నులు, జమ్మాదేవిపేట ఆర్‌కేఎస్‌లో పది టన్నులు నిల్వ ఉందని చెప్పారు. మండలంలో 23 ఆర్‌కేఎస్‌లలోని రైతులకు ఎవరికి కావల్సినా తెలియజేయాలన్నారు. ప్రస్తుతం వర్షాలు ఎక్కువగా ఉన్నందున ఎటువంటి ఎరువులు వేయరాదన్నారు. పంట ఈనిక దశలో ఉన్నప్పుడు పొటాష్ వేయాలని సూచించారు. ఈ సమయంలో దోమ వచ్చే అవకాశాలు ఉన్నాయని రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. రబీకి సంబంధించి మినుములు, పెసలు, వరి విత్తనాలు త్వరలో వస్తాయని చెప్పారు.

వైద్య విద్య ప్రైవేటీకరణకు ప్రభుత్వం కుట్ర

చీపురుపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్య విద్యను ప్రైవేటుపరం చేయడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఆరోపించారు. కోటి సంతకాల సేకరణలో భాగంగా గురువారం ఆయన పట్టణంలోని రామాంజనేయ కాలనీ, కొత్తఅగ్రహారం ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ వైద్య విద్య ప్రైవేటీకరణను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. పార్టీ నాయ కులు పాల్గొన్నారు.

- నెల్లిమర్ల: రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పిలుపునిచ్చారు. మొయిద విజయరాంపురంలోని ఎమ్మెల్సీ డా.సురేష్‌బాబు స్వగృహంలో గురువారం ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 28న నెల్లిమర్లలో నిర్వహించనున్న ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. వైసీపీ నియోజకవర్గ పరిశీలకుడు నెక్కల నాయుడుబాబు, వైసీపీ మండల అధ్యక్షుడు గదల సన్యాసినాయుడు, ఎంపీపీ అంబళ్ల సుధారాణి పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఈఈఎంటీ నమోదు ప్రక్రియ

డెంకాడ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ అనుమతితో ఎడ్యుకేషనల్ ఎపిఫనీ (ఈఈ) అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 4వ రాష్ట్ర స్థాయి ఆన్‌లైన్ మెరిట్ టెస్టు 2026కు విద్యార్థుల నమోదు ప్రక్రియ ఈనెల 15 నుంచి వచ్చే నెల 14 వరకు కొనసాగుతుందని ఎంఈవో-1 కేవీ రమణ, ఎంఈవో-2 కృష్ణ తెలిపారు. వారు గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈ పరీక్షల్లో ప్రభుత్వ ఆధారిత పాఠశాలలో 7, 10వ తరగతి విద్యార్థులు ఉచితంగా పాల్గొనవచ్చునన్నారు. ఈ పరీక్ష ప్రిలిమ్స్, మెయిన్స్ అనే రెండు దశల్లో నిర్వహించనున్నట్టు వారు చెప్పారు. ప్రిలిమ్స్ పరీక్షను విద్యార్థులు తమ పాఠశాలలో గానీ, ఇంటి వద్ద గానీ రాయవచ్చన్నారు. మెయిన్స్ పరీక్ష మాత్రం 13 ప్రధాన కేంద్రాలలో ఈఈ బృందాల పర్యవేక్షణలో నిర్వహిస్తారని వారు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో పదో తరగతి విద్యార్థులకు వరుసగా రూ.30వేలు, రూ.25వేలు, రూ.20వేలు, 7వ తరగతి విద్యార్థులకు రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు అందజేస్తారన్నారు. అలాగే జిల్లా స్థాయిలో 10వ తరగతి విద్యార్థులకు బహుమతులు వరుసగా రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు, 7వ తరగతి విద్యార్థులకు నగదు బహుమతులు వరుసగా రూ.5వేలు, రూ.4వేల, రూ.3వేల నగదు బహుమతులు అందజేస్తారని తెలిపారు. అదనంగా మండల స్థాయిలో టాప్-3 విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు ఇవ్వనున్నారన్నారు. ప్రతీ పాఠశాల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యాధికారులు విద్యార్థులను ప్రోత్సహించి ఈ రాష్ట్రస్థాయి ఉచిత పరీక్షలలో పాల్గొనేలా చైతన్యం చేయాలని వారు కోరారు. వివరాలకు 9951002400 నెంబరుకు సంప్రదించాలన్నారు.

ఆరుబయట వంట.. మూలకు చేరిన ఆర్వో ప్లాంటు

- ఆవరణలో మురుగునీరు నిల్వ
- ఇదీ పారాది ఉన్నత పాఠశాలలో పరిస్థితి

బొబ్బిలి రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పారాది ఉన్నతపాఠశాలలో సమస్యలు తిష్ట వేశాయి. ఇక్కడ కట్టెలపై ఆరుబయట వంటలు చేయాల్సివస్తోంది. ప్రధానంగా ఆవరణలో మురుగు నీరు నిల్వ ఉండడంతో విద్యార్థులు అవస్థలకు గురవుతున్నారు. పారాది ఉన్నతపాఠశాల ఆవరణలో అపారిశుధ్యం తాండవిస్తోంది. మురుగు నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో ఆవరణలోనే పసుపు రంగులో బుడగల రూపంలో మురుగుతోంది. శుద్ధ జలాలను అందించాల్సిన ఆర్వోప్లాంట్ మూలకు చేరడంతో ఆ గదికి తాళంవేశారు. గ్యాస్ సిలిండర్లతోనే మధ్యాహ్న భోజనం వంటలు చేయాల్సిఉండగా కట్టెల పొయ్యిపై నిర్వాహకులు తయారుచేస్తున్నారు. ప్రతి మూడో శనివారం పాఠశాల ఆవరణలో స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పిచ్చిమొక్కలు తొలగించి పరిశుభ్రం చేయాల్సిఉన్నా ఆ కార్యక్రమాన్ని అటకెక్కిస్తున్నారు. కాగా పారాది పాఠశాలలో సమస్యలు తన దృష్టికి రాలేదని, పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎంఈవో వాసుదేవరావు తెలిపారు.



నిరుపయోగంగా ఉన్న ఆర్వో ప్లాంటు



ఆరుబయట కట్టెలపొయ్యిపై వండుతున్న దృశ్యం

ఉద్యోగాలకు 248 మంది ఎంపిక

రాజాం రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇన్ఫోసిస్ గత కొద్దిరోజులుగా రాజాంలోని జీఎంఆర్ ఐటీలో నిర్వహించిన ప్లేస్‌మెంట్స్ గురువారంతో ముగిశాయి. ఇందులో కళాశాలకు చెందిన 248 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. వీరికి సంస్థ ప్రముఖులు అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ అందజేశారు. ఈ విషయాన్ని కళాశాల ఎడ్యుకేషన్ డైరెక్టర్ డా.గిరీష్ గురువారం వెల్లడించారు. ఎంపికైన వారిని ప్రిన్సిపాల్ డా.ప్రసాద్, ప్లేస్‌మెంట్ విభాగాధిపతి కిరణ్‌కుమార్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డా.అట్టాడ వెంకటరమణ అభినందించారు.

బాలికల రక్షణ బాధ్యత ఉపాధ్యాయులదే

- డీఎస్పీ గోవిందరావు

భోగాపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బాలికల ను అన్ని విధాల రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే అని విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు అన్నారు. భోగాపురంలోని కేజీబీవీని ఆయన గురువారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలన్నారు. ఇతరులను లోనికి రాకుండా చూడాలన్నారు. సీసీ కెమెరాలు, విద్యుత్తు దీపాలు అవసరమైతే పైఅధికారులకు తెలియజేయాలన్నారు. అనంతరం బాలికలతో మాట్లాడారు. ఆయనతో పాటు సీఐ కె.దుర్గాప్రసాదరావు, ఎస్ఐ వి.పాపారావు ఉన్నారు.

చదువుపై దృష్టి సారించాలి

బాలికలు విద్యపై దృష్టి సారించి మంచి ప్రయోజకులు కావాలని సీఐ కె.దుర్గాప్రసాదరావు సూచించారు. గురువారం భోగాపురం కేజీబీవీలో ఇంటర్ విద్యార్థినుల తో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. చదువుపై మాత్రమే దృష్టి సారించాలని సూచించారు. మానసికంగా ధైర్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వి.పాపారావు, హెచ్‌సీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు బాధ్యత వహించాలి

లక్కవరపుకోట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యా ర్థుల భవిష్యత్తు పట్ల తల్లిదండ్రులు పూర్తి బాధ్యత వహించాలని ఎస్ఐ నవీన్‌పడాల్ అన్నారు. గురువా రం గేదెలవానిపాలెం గ్రామంలో ఆయన ఆధ్వర్యంలో నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల, పోక్సో కేసుల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే ప్రతి చిన్న విషయానికి కేసులు పెట్టుకోవడం మంచిది కాదని సూచించారు. ఈ కార్యక్ర మంలో గ్రామ పెద్దలతో పాటు పోలీసులు పాల్గొన్నారు.



సూచనలు చేస్తున్న డీఎస్పీ గోవిందరావు

రిలే దీక్షలో జిందాల్ నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతుల నుంచి జిందాల్ పరిశ్రమ కోసం సేకరించిన భూములను గత ప్రభుత్వంలో కొందరు ప్రజాప్రతినిధులు, పలు ముఖ్య శాఖల అధికారుల ఆధ్వర్యంలో భూములు అమ్మకాలు చేశారని జిందాల్ నిర్వాసితులు ఆరోపించా రు. గురువారం బొడ్డవరలో తమ 125 రోజు నిరసనలో భాగంగా వారు మాట్లాడారు. ఈ భూముల అమ్మకాలకు సంబంధించి తమ వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయని, వీటిపై గతంలో జిల్లా గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తే వాటిని తొక్కిపెట్టారన్నారు. దీనిపై ప్రభుత్వం విచారణ జరిపించాలని కోరారు.



బొడ్డవర వద్ద రిలే దీక్షలో పాల్గొన్న నిర్వాసితులు

గ్రామ సభలు పెట్టారు.. పరిష్కారం మరిచారు

బొడ్డవర ప్రాంతంలో గతంలో జిందాల్ పరిశ్రమ నిర్వాసితులు 125 రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్న విషయాన్ని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ.. కలెక్టర్ రామసుందర్‌రెడ్డి దృష్టికి గురువారం తీసుకెళ్లారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఈ నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం గ్రామసభ నిర్వహించారని.. అయితే వినతులు తీసుకుని నేటికీ వాటికి పరిష్కారం చూపించలేదని కలెక్టర్‌కు వివరించారు. వెంటనే ఈ సమస్య పరిష్కారానికి కలెక్టర్ చొరవ చూపాలని ఆయన కోరారు.

యువకుడి ఆత్మహత్య

బొండపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడసింగిపేట గ్రామానికి సమీపంలో రైలు కిందపడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం జరిగిన ఈ ఘటనపై బొబ్బిలి రైల్వే ఇన్‌చార్జి ఎస్ఐ డి.రత్నకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గజపతినగరం మండలం తుమ్మికాపల్లి గ్రామానికి చెందిన నడిపిల్లి వెంకటేష్(23) ఇటీవల తన తండ్రి చనిపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈమేరకు గురువారం బోడసింగిపేట సమీపంలో ఉన్న రైల్వే ట్రాకుపై రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్టేషన్ మాస్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుని వద్ద లభించిన ఆధారాలను సేకరించారు. కేసు నమోదుచేసి, మృతదేహాన్ని పంచనామా నిమిత్తం జిల్లా కేంద్రంలోని సర్వజన ఆసుపత్రికి తరలించారు.

పాము కాటుతో మహిళ మృతి

గజపతినగరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పాముకాటుకు గురై మహిళ మృతి చెందిన సంఘటన కొనిస గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సూరెడ్డి అన్నపూర్ణ(50) తమ పంట పొలంలో పత్తి పంట ఏరివేతకు వెళ్లగా పాము కాటు వేసింది. చుట్టుపక్కల వారు వచ్చి స్థానిక ఏరియా ఆసుపత్రికి తలించారు. అప్పటికే మృతిచెందడంతో శవపంచనామా నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. భర్త బుచ్చినాయుడు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గంజాయి కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు

విజయనగరం క్రైం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్.కోట పోలీసు స్టేషన్‌లో 2018లో నమోదైన గంజాయి కేసులో ఏఎస్ఆర్ జిల్లా డుబ్రిగూడ మండలానికి చెందిన నిందితుడు కిముడు జయరామ్, అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలానికి చెందిన దత్తి ప్రవీణ్‌లకు మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.20వేలు జరిమానా విధిస్తూ ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ న్యాయాధికారి ఎం.మీనాదేవి గురువారం తీర్పు వెల్లడించినట్టు ఎస్పీ దామోదర్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఎస్పీ తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. ఎస్.కోట పోలీసు స్టేషన్ పరిధిలోని ఆకుల డిపో ప్రాంతంలో 2018 డిసెంబరు 20న ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై గంజాయి రవాణా చేస్తున్నట్టు వచ్చిన సమాచారంతో ఎస్.కోటకు చెందిన పోలీసులు అక్కడకు చేరుకుని వారిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. ద్విచక్ర వాహనం తనిఖీ చేసి.. 3,750 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అప్పటి ఎస్ఐ అమ్మినాయుడు కేసు నమోదు చేయగా, అప్పటి సీఐ డి.వెంకటరావు దర్యాప్తు చేపట్టి, నిందితులను అరెస్టు చేశారు. అనంతరం సీఐగా బాధ్యతలు చేపట్టిన బి.శ్రీనివాసరావు కోర్టులో అభియోగ పత్రాలు జారీ చేశారు. విచారణలో నిందితులు కిమిడి జయరామ్, దత్తి ప్రవీణ్‌లపై నేరారోపణలు రుజువయ్యాయి. దీంతో వారిద్దరికీ కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానా విధించారు. ఈ కేసులో నిందితులకు శిక్ష పడే విధంగా క్రియాశీలకంగా వ్యవహరించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

పుస్తెలతాడు చోరీ

రాజాం రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): భర్తతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ మహిళ మెడలోని బంగారు పుస్తెలతాడును ముగ్గురు యువకులు వెనుక నుంచి వచ్చి, తెంపుకొని పరారయ్యారు. ఈ ఘటన రాజాం ప్రాంతంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని పెనుబాక గ్రామానికి చెందిన గంగు భాగ్యలక్ష్మి గురువారం తన భర్త సురేష్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై రాజాం వస్తోంది. చీపురుపల్లి రోడ్డులోని గాయత్రీ కాలనీ సమీపంలోకి వచ్చేసరికి.. వీరిని ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై అనుసరిస్తూ వచ్చారు. వెనుక నుంచి భాగ్యలక్ష్మి మెడలోని రెండు తులాల బంగారు పుస్తెలతాడును తెంపుకొని, పారిపోయారు. దీంతో ఆమె కిందపడి గాయాలపాలయ్యారు. చికిత్స నిమిత్తం రాజాం సామాజిక ఆసుపత్రిలో చేరారు. అనంతరం భాగ్యలక్ష్మి దంపతులు రాజాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ రవికిరణ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఎంపీడీవోపై విచారణ

బొండపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గత ఏడాది అక్టోబరు 4 నుంచి ఈ ఏడాది అక్టోబరు వరకు పనిచేసిన ఎంపీడీవోలు ప్రభుత్వం అందిస్తున్న హెచ్ఆర్ఏలు, వాహన అలవెన్సులను నిబంధనలకు విరుద్ధంగా డ్రా చేసుకుని, లక్షలాది రూపాయలు నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారని అంబేడ్కర్ యువజన సేవా సంఘం అధ్యక్షుడు బగ్గా ఎర్రయ్య.. డిప్యూటీ సీఎంకు, లోకాయుక్తాకు ఫిర్యాదు చేశారు. వారి ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ సీఈవో బీవీ సత్యనారాయణ.. ఎంపీడీవో జి.గిరిబాలతోపాటు ఇన్‌చార్జి ఎంపీడీవోలుగా పనిచేసిన వారిని గురువారం విచారించారు. మండల కేంద్రంలో నివాసం ఉండకుండా హెచ్ఆర్ఏను విజయనగరంలో నివాసం ఉంటూ ప్రతినెలా ట్రెజరీ ద్వారా డ్రా చేసుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై జడ్పీ సీఈవో మాట్లాడుతూ ఫిర్యాదు మేరకు ఇక్కడు వచ్చామని.. హెచ్ఆర్ఏ, వెహికల్ అలవెన్సుపై రికార్డులను పరిశీలించి, సమగ్ర దర్యాప్తు నిర్వహించి నివేదికను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో కె.తులసీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి నిర్వాసితుల సమస్యలు

భోగాపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్వాసితుల సమస్యలను రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు కలెక్టర్ రామసుందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గృహాలు కోల్పోయిన వారికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, కాలనీలో పూర్తి సౌకర్యాలు కల్పించాలని, తక్షణమే రావాల్సిన పరిహారం అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దాట్ల కీర్తి తదితరులు పాల్గొన్నారు.

ఐసీఆర్‌పీలపై రాజకీయాలు తగవు

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ ఐసీఆర్‌పీలపై రాజకీయం చేయడం తగదని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కామేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక అమర్‌భవన్‌లో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బుగత అశోక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఏపీ కమ్యూనిటీ మేనేజ్ నేచురల్ ఫార్మింగ్‌లో ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ విధి నిర్వహణలో ఉన్న ఎనిమిది మందిని రాజకీయ ఒత్తిడి కారణంగా ఉద్యోగాలు తొలగించడం సరైన పద్ధతి కాదన్నారు. జిల్లాలోని గజపతినగరం నియోజకవర్గంలో బొండపల్లి, గంట్యాడ, మెంటాడ మండలాల్లో 10 మంది ఐసీ ఆర్‌పీలుగా ఏడేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఏడాది కాలంగా వేతనా లు చెల్లించకపోయినప్పటికీ, వీరికి స్థానిక రాజకీయ నాయకుల ఒత్తిడితో ఉద్యో గాలు నిలుపుదల చేయడం సమంజసం కాదన్నారు. వీరికి ఉన్నచోటే ఉద్యోగా లు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో కృష్ణ జ్యోతి, లక్ష్మి, ఎస్.లక్ష్మి పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలను పునరుద్ధరించాలి

రాజాం రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆరోగ్యశ్రీ సేవలను పునరుద్ధరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకుడు రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. ఈమేరకు రాజాంలో గురువారం నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సేవలు నిలిచిపోవడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారంతా వైద్యసేవలు అందక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈనెల 10 నుంచి ఆర్యోగ్యశ్రీలోని అన్ని ఎమర్జెన్సీ సేవలు నిలిచిపోవడంతో కార్డియాలజీ, న్యూరాలజీ, బ్రెయిన్‌స్ట్రోక్ బారిన పడిన రోగుల పరిస్థితి భయానకంగా మారిందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆరోగ్యశ్రీ సేవలు పునరుద్ధరించాలని, పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

బెల్ట్ నిర్వాహకులపై బైండోవర్

రాజాం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బెల్ట్ షాపులు నిర్వహించినవారిపై కఠిన చర్యలు తప్పవని రాజాం ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ జైభీమ్ హెచ్చరించారు. వివిధ కేసుల్లో పట్టుబడిన 30 మంది బెల్ట్ నిర్వాహకులపై బైండోవర్ కేసులు నమోదు చేసి, గురువారం స్థానిక తహసీల్దార్ రాజశేఖర్ ఎదుట హాజరు పరిచారు. వీరికి లక్ష పూచీకత్తుతో ఒక సంవత్సర కాల పరిమితికి బైండోవర్ చేసినట్టు సీఐ తెలిపారు. ఇప్పటివరకు 139మందిపై బైండోవర్ కేసులు పెట్టినట్టు చెప్పారు. ఆయన వెంట స్థానిక ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీ పరిశీలన

దత్తిరాజేరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నం గ్రామ పంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని (ఎస్ డబ్ల్యూపీసీ)ని బొబ్బిలి డీఎల్‌డీవో కిరణ్‌కుమార్ గురువారం పరిశీలించారు. ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ప్రజలకు తడిచెత్త, పొడిచెత్తల పై అవగాహన కల్పించాలని, పారిశుధ్య కార్మికులు చెత్త సేకరించేటప్పుడు తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలన్నారు. గ్రామాల్లో నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు.

డోలీ మోతలు తప్పేలా.. అంబులెన్స్‌లు వెళ్లేలా

(5వ పేజీ తరువాయి)

మండలంలో 13 రోడ్లు, కురుపాం మండలంలో 14, జియ్యమ్మవలస లో ఒకటి, గుమ్మలక్ష్మీపురంలో 23, సీతంపేటలో ఆరు, పార్వతీపురంలో ఐదు, మక్కువలో రెండు, సాలూరులో ఏడు, పాచిపెంట మండలంలో 12 రహదారులను నిర్మించనుంది. వీటికోసం రూ.27.85కోట్లు మంజూరు చేసింది. కొమరాడ మండలంలోని వనబడి- తేలేసుకు రహదారి, సీతంపేట మండలంలోని కొండాడ పంచాయతీ కొండారెడ్డి-బేధిమాను గూడ రోడ్డు, పార్వతీపురం మండలంలోని పాత బుదురువాడ-కొత్త బుధవారం వరకు రహదారితో పాటు కల్వర్టు నిర్మాణం జరగనుంది. మక్కువ మండలంలో సిరమానుగూడ, అలగురువు, చేలుగుండ రోడ్లు, సాలూరు మండలం సారిక పంచాయతీ కురుకూటి పాలివలస-సంగం వలస, పాచిపెంటలో ఎన్‌హెచ్ 26 నుంచి చంద్రవలసకు, కురుపాం మండలం చాపరాయి గూడ పంచాయతీలో అగులుగోడ నుంచి సాపరాయిగోడ వరకు, జియ్యమ్మవలస లో ఆంధ్రసింగి బీటీ నుంచి కోతాము వరకు, గుమ్మలక్ష్మీపురం మండలం బాలేసు పంచాయతీలో బాలేరు జంక్షన్ నుంచి బాలేష్‌గోడ వరకు రహదారి నిర్మాణం జరగనుంది. రోడ్ల నిర్మాణంతో పాటు నీరు ఎక్కువగా వచ్చే ప్రాంతాల్లో కల్వర్టులు కూడా కట్టనున్నారు.

గిరిజనుల అభివృద్ధే లక్ష్యం

గిరజనుల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలోని గిరిజన ప్రాంతాలకు బీటీ రోడ్లు నిర్మించాం. సాలూరు నియోజకవర్గంలో వంద రోజుల్లో వంద రహదారుల నిర్మాణాలు జరిగాయి. ప్రతి గిరిజన గ్రామానికీ అంబులెన్స్ వెళ్లే విధంగా రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేశాం.

-గుమ్మిడి సంధ్యారాణి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి

ఆదేశాలు జారీ చేశాం..

గిరిజన గ్రామాలకు అంబులెన్స్‌లు వెళ్లే విధంగా రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని అధికారులను ఆదేశించాం. వీటివల్ల గిరిజన ప్రజలకు డోలీ మోతలు తప్పనున్నాయి. దశలవారీగా అన్ని గిరిజన గ్రామాలకు రోడ్లు నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

-ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్

హమ్మయ్య.. ఊపిరి పీల్చుకోవచ్చు

(5వ పేజీ తరువాయి)

యార్డుకు ఆనించి ఉన్న గోపసాగరం కూడా కలుషితం అవుతుంది. తరచూ చెత్త, వ్యర్థాలు రహదారికి పైకి వస్తుండడంతో స్థానికులు నరకం చూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో డంపింగ్ యార్డు తరలింపు కాగితాలకే పరిమితమయ్యింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ సమస్యను ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సమస్యను పరిష్కరించేందుకు అడుగులు పడుతున్నాయి. స్వచ్ఛాంధ్ర సహకారంతో తరుణ్ అసోసియేట్స్ ఆధ్వర్యంలో డంపింగ్ యార్డులో ఉన్న ప్లాస్టిక్ సంచులతో పాటు ఇతర వ్యర్థాలను వేరు చేసేందుకు రీసైక్లింగ్ మిషన్‌ను సిద్ధం చేశారు. ప్లాస్టిక్‌ను వేరు చేసి మునిసిపాలిటీకి ఆదాయ మార్గాన్ని సృష్టించనున్నారు. మిగతా వ్యర్థాలను సేంద్రియ ఎరు వుగా తయారు చేసేందుకు ఇంజనీరింగ్ అధికా రులు కసరత్తు చేస్తున్నారు. రీ సైక్లింగ్‌లో భాగంగా డంపింగ్ యార్డులో ఉన్న 12 వేల టన్నుల చెత్త, వ్యర్థాలను వేరు చేసి పర్యావరణానికి మేలు చేసే విధంగా ప్రణాళికలను రూపొందిస్తున్నారు.

కల్తీ మద్యం పాపం జగన్‌దే

(5వ పేజీ తరువాయి)

ప్రజల ముందుంచుతాం. వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన నేతలపై ఆరోపణలు రావడంతోనే వారిని సస్పెండ్ చేశాం. ఇది మా ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. వైసీపీకి చెందిన ఎంపీ మిథున్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వంటి నాయకులపై కల్తీ మద్యం ఆరోపణలు ఉన్నా వారిని ఆ పార్టీ నుంచి సస్పెండ్ చేయలేదు. తాడేపల్లి ప్యాలెస్ పాత్ర అందుకే అనుమానా స్పదంగా ఉంది. కల్తీ మద్యం అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక సురక్షా యాప్‌ను రూపొందించింది. విశాఖ, కాకినాడ, గుంటూరు, కర్నూలు, చిత్తూరులో నూతన మద్యం పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. 13 ర కాల ఈఎన్ఏ (ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కాహాల్) పరీక్షల ద్వారా మద్యం నాణ్యతను కచ్చితంగా నిర్ధారిస్తున్నాం. బ్రాండెడ్ మద్యం అందుబా టులో ఉం చుతున్నాం. కల్తీ మద్యానికి రా ష్ట్రంలో చోటులేదు.' అని మంతి పేర్కొన్నారు.

పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలి

(5వ పేజీ తరువాయి)

శంకుస్థాపన దగ్గర నుంచి ప్రారంభించే వరకూ ఎంపీడీవోలే బాధ్యత వహించాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో జ్వరాలు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉందని, అటువంటి కేసులు ఉన్న ఆసుపత్రులను ఎండీపీవోలు ప్రతిరోజూ సందర్శించి వైద్యసేవలను పర్యవేక్షించాలన్నారు. అన్ని పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలు జరిగేలా చూడాలన్నారు. ఆరుబయట చెత్త వేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో 'మా ఊరికి మలేరియా వచ్చింది' అని దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. జిల్లాలో రానున్న మూడు మాసాలు డ్రైడే.. డ్రైడే కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు.

వి'నూతనం'గా పైప్‌లైన్

(5వ పేజీ తరువాయి)

భూములకు సాగునీరందించాలన్నది ఈ పైలట్ ప్రాజెక్టు లక్ష్యం. సాలూరు, బొబ్బిలి నియోజకవర్గ పరిధిలోని భూములకు పెద్దగెడ్డ ద్వారా పూర్తిస్థాయిలో సాగునీరందించేందుకు ఈ నూతన ప్రాజెక్టు దోహదం చేస్తుందని రైతులు భావిస్తున్నారు. పెద్దగెడ్డ జలాలు ఇంత వరకు రామభద్రపురం మండలం కొట్టక్కి ప్రాంతం వరకే వస్తున్నాయి. కొత్త విధానంలో అదనంగా 1990 హెక్టార్ల భూములకు సాగునీరందించేందుకు అవకాశం ఉంది. పెద్దగెడ్డ ప్రాజెక్టు నుంచి సాగునీటిని బాడంగి మండలం డొంకినవలస వరకు రప్పించాలని ఈ ప్రాంత రైతులు దశాబ్దాలుగా అడుగుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాం నుంచి ఈ డిమాండ్ ఉంది. అప్పట్లో తెర్లాం మాజీ ఎమ్మెల్యే వాసిరెడ్డి వరద రామారావు ఎన్నికల హామీలో చేర్చారు. అయినా సాకారం కాలేదు. పంట కాలువలను ఆధునీ కరిస్తేనే అదనపు ఆయకట్టు భూములకు సాగునీరందుతుంది. గతంలో జపాన్ బ్యాంకు నిధుల(జైకా)తో పెద్దగెడ్డ ప్రాజెక్టును ఆధునికీకరించాలని భావించారు. ఆ ప్రతిపాదనా పట్టాలెక్కలేదు. ఎమ్మెల్యే బేబీనాయన కూడా పెద్దగెడ్డ నీటిని బాడంగి మండలం డొంకినవలసకు రప్పించేందుకు కృషి చేస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత జైకా నిధులతో పనులు చేసేందుకు కసరత్తు చేశారు. ఈ లోగా కేంద్రమే పెద్దగెడ్డను పైలట్ ప్రా జెక్టు కింద ఎంపిక చేసింది. తొలుత భోపాల్‌కు చెం దిన బృందాలు ప్రాజెక్టు భూముల్లో సర్వే చేశాయి. ఎం.క్యాడ్ పనులకు ఇక్కడ అనుకూలమేనని నిర్ధారించి కేంద్రానికి నివేదించాయి.

- రామభద్రపురం మండలంలోని 7 గ్రామాల్లో 314 ఎకరాలకు కొత్త విధానంలో సాగునీరు అందనుంది. జన్నివలస, కొట్టక్కి, తారాపురం, రామ భద్రపురం, బూసాయవలస, సోంపురం, ఇట్లామామిడిపల్లి గ్రామాలకు సాగునీరు అందించనున్నారు. స్కాడా టెక్నాలజీ ద్వారా కంట్రోల్ రూం పర్య వేక్షణలో క్లస్టర్ విలేజ్‌లు ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన సాగునీరు అందించనున్నారు.

దేశంలోనే మొట్టమొదటి పైలట్ ప్రాజెక్టు

కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల వాటా ధనంతో దేశంలోనే మొదటిగా పైలట్ ప్రాజెక్టు కింద ప్రభుత్వం పెద్దగెడ్డను ఎంపిక చేసింది. రూ.74 కోట్లతో పనులు చేపట్టేందుకు అవసరమైన సర్వే పనులు జరుగుతున్నాయి. జలాశయం నుంచి పంటకాలువల పొడవునా గట్టును లోతుగా తవ్వి పైపు లైన్లు వేసి ఆయకట్టు భూములకు సాగునీరందించడం ఈ పైలట్ ప్రాజెక్టు లక్ష్యం. దీనివల్ల పంట కాలువల నిర్వహణ సమస్య రాదు. సుమారు 2 వేల హెక్టార్ల భూములకు అదనంగా సాగునీరందించేందుకు వీలుంటుంది. జైకా పరిధి నుంచి పెద్దగెడ్డ ప్రాజెక్టును తప్పించే అవకాశం ఉంది.

-అప్పారావు, ఇరిగేషన్ సూపరింటెండెంట్ ఇంజనీరు, బొబ్బిలి సర్కిల్

విద్యతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

పాచిపెంట/సాలూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని సరాయివలస గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో భవన నిర్మాణాలకు గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. ఇందుకు గానూ ఐటీడీఏ నుంచి రూ. 4.76 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గిరిజనుల విద్యా ప్రగతికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో 42 పాఠశాలల భవన నిర్మాణాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు రూ. 183 కోట్లను మంజూరు చేశారన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఆరు పాఠశాలలకు రూ. 21 కోట్లు మంజూరయ్యాయన్నారు. అందులో సాలూరు నియోజకవర్గంలో మూడు పాఠశాలలకు రూ. 13 కోట్లు కేటాయించారన్నారు. ప్రధానంగా విద్యతో పాటు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మేట్రిన్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు సూచించారు. పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలన్నారు. కార్యక్రమంలో సాలూరు ఏఎంసీ చైర్మన్ ముఖి సూర్య నారాయణ, మండల టీడీపీ అధ్యక్షులు గూడేపు యుగంధర్, నాయకులు కొత్తల పోలినాయుడు, కోరిపల్లి సురేష్, పిన్నింటి ఈశ్వరరావు, పల్లేడ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

నందన్నను దర్శించుకున్న మంత్రి

సాలూరు, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వడ్డివీధిలోగల మజ్జివారి ఇంటిలో కొలువైన నందన్నను గురువారం రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మొక్కుబడులు సమర్పించుకున్నారు. ఆమె వెంట 20వ వార్డు కౌన్సిలర్ శైలజ, మాజీ కౌన్సిలర్ చిరంజీవి, నటరాజ్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన జయకృష్ణ



డిప్యూటీ సీఎంకు సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పార్వతీపురం/పాలకొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పాలకొండ నియోజకవర్గంలోని సమస్యలపై జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు వినతిపత్రం అందజేసినట్టు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు. గురువారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. సీతంపేట ఆసుపత్రికి డయాలసిస్ కేంద్రాన్ని మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపానన్నారు. అలాగే నియోజకవర్గంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని కోరానన్నారు. పాలకొండ ఏరియా ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వైద్యులను నియమించాలని, ప్రతి గ్రామానికి పక్కా రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని డిప్యూటీ సీఎంకు విన్నవించాన ఎమ్మెల్యే తెలిపారు.

ప్రభాస్ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే



ఆహారం అందజేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం టౌన్/బెలగాం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో గురువారం సినీ నటుడు ప్రభాస్ జన్మదిన వేడుకలను సందడిగా నిర్వహించారు. వేడుకల్లో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభాస్ అభిమానులు వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. నాయకులు మజ్జి వెంకటేష్, ప్రభాస్ అభిమానులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

పార్వతీపురం రూరల్, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. గురువారం క్యాంప్ కార్యాలయంలో ఆయన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ఇళ్లు మంజూరు చేయాలని, రహదారులు నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఆయన సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు.

ఇళ్ల దరఖాస్తుదారులపై ఆరా

పార్వతీపురం రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బొడ్డవలసలో ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్ల మంజూరు కోసం దరఖాస్తులు చేసుకున్నవారి జీవన స్థితిగతులపై సబ్ కలెక్టర్ డాక్టర్ వైశాలి ఆరా తీశారు. గురువారం బొడ్డవలసను సబ్ కలెక్టర్ సందర్శించారు. ప్రస్తుతం దరఖాస్తుదారులు నివాసం ఉంటున్న ఇళ్లను ఆమె పరిశీలించారు. దరఖాస్తుదారులతో మాట్లాడారు. ఆమెతో పాటు తహసీల్దార్ సురేష్ ఉన్నారు.

జల వనరులను పరిరక్షించండి

పార్వతీపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జల వనరులు, చెరువులు ఆక్రమణలకు గురి కాకుండా వాటిని పరిరక్షించాలని జేసీ యశ్వంత్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో చెరువులు, జలవనరులపై జేసీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గత సమావేశాల్లో తీసుకున్న చర్యలు నివేదికలను జేసీ అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, పార్వతీపురం మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

యంత్ర పరికరాలను వినియోగించుకోండి

సీతంపేట రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు ప్రభుత్వం అందిస్తున్న యంత్ర పరికరాలను వినియోగించుకుని వ్యవసాయంలో లాభాలు సాధించాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో గురువారం గిరిజన రైతులకు ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో 50 శాతం రాయితీపై మినీ ట్రాక్టర్లను పీవో పంపిణీ చేశారు. గ్రామాల్లోని మిగిలిన రైతులకు కూడ తోడ్పాటు అందించాలన్నారు. పీహెచ్‌వో గణేష్, డీడీ ఎం.అన్నాదొర, డిప్యూటీ ఈవో రామ్మోహనరావు, కంపెనీ మేనేజర్ శేషు పాల్గొన్నారు.

దేవస్థానం అభివృద్ధికి చర్యలు

గరుగుబిల్లి, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో చినతిరుపతిగా ప్రసిద్ధి గాంచిన తోటపల్లి శ్రీవెంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాల అభివృద్ధికి చర్యలు చేపడతానని ఆలయ ఈవో బి.శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన ఈవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. దాతలు సహకరించాలని కోరారు. ఆలయ అభివృద్ధి ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ డి.పారినాయుడు మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి తమవంతు సహకారం పూర్తిస్థాయిలో అందిస్తున్నామన్నారు.ఈ సందర్భంగా విధుల్లోకి ఈవో శ్రీనివాస్, బదిలీపై వెళుతున్న ఈవో సూర్యనారాయణలను సత్కరించారు. కార్యక్రమంలో బిఎం.పకీరునాయుడు, ఎం.ప్రకాశ్‌రావు, టి.దుర్గారావు, ఎస్.సత్యనారాయణ, ఎం.వాసుదేవరావు, ఎం.మురళీనాయుడు, బలరాంనాయుడు, జి.శ్రీధర్‌తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

బెలగాం, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు విరాజ్ దేవాంగ్ డిమాండ్ చేశారు. పట్టణంలో గురువారం ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. సమావేశంలో ఏఐ ఎస్ఎఫ్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వలరాజు, బందెల నాసర్, కుల్లాయి స్వామి ఉన్నారు.

ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా
పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా
ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, విజయనగరం : 9985411533
పార్వతీపురం : 9985403035, సాలూరు : 9492900300

పాలకొండను జిల్లాగా ప్రకటించండి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న నాయకులు

పాలకొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పాలకొండను జిల్లాగా ప్రకటించాలని, లేకుంటే శ్రీకాకుళం జిల్లాలో కలపాలని పాలకొండ జిల్లా సాధన సమితి నాయకులు కనపాక చౌదరినాయుడు, సబ్బ నానాజీ కోరారు. గురువారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవితో పాటు వారు కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకొండకు జిల్లాకు కావాల్సిన అన్ని వసతులు, భౌగోళిక పరిస్థితులు ఉన్నాయన్నారు. పాలకొండ పాత రెవెన్యూ డివిజన్‌ను ఒక జిల్లా చేయాలని విన్నవించారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



సమస్యలు తెలుసుకుంటున్న డీపీవో

గరుగుబిల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరిధిలో పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు హెచ్చరించారు. గురువారం సంతోషపురం పంచాయతీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అసౌకర్యం కలగకుండా పారిశుధ్య పనులను విధిగా చేపట్టాలన్నారు. వర్షాలు కురుస్తున్న దృష్ట్యా అంటువ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ చల్లాలన్నారు. తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేపట్టాలన్నారు. వ్యాధులు ప్రబలితే దానికి బాధ్యత కార్యదర్శులదేనన్నారు. ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. సేంద్రియ ఎరువుల తయారీపై శ్రద్ధ చూపాలన్నారు. ఇంటి పన్ను వసూలుపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అంబటి రాంబాబు పంచాయతీల పరిధిలోని పలు సమస్యలను డీపీవో దృష్టికి తీసుకువెళ్లారు. ఆయనతో పాటు డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు, కార్యదర్శి పి.రాజేశ్‌కుమార్, క్షేత్ర సహాయకులు జి.వెంకటనాయుడు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జియ్యమ్మవలస, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద బుడ్డిడి 11 కేవీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించడంతో పాటు విద్యుత్ లైన్లు సరిచేయనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని డీఈఈ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదబుడ్డిడి ఫీడర్ పరిధిలోని చినబుడ్డిడి, పెదపూడి గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

పాలకొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో పంచారామ క్షేత్రాల దర్శనానికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్టు జిల్లా ప్రజా రవాణాధికారి పట్నాల వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో పంచారామాల దర్శనానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అక్టోబరు 26, నవంబరు 9, 16 తేదీల్లోని పాలకొండ కాంప్లెక్స్ నుంచి సాయంత్రం 3 గంటలకు బస్సులు బయలుదేరి ఐదు పంచారామాల పుణ్యక్షేత్రాలను సోమవారాల్లో దర్శింపజేసి మంగళవారం ఉదయం 7 గంటలకు పాలొండ ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుతాయన్నారు. శబరిమల, శ్రీశైలం వెళ్లేందుకు భక్త బృందాలు సంప్రదిస్తే బస్సులను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ వి.రమేష్, ఆర్టీసీ ఉద్యోగులు లంక రాము, ఉమామహేశ్వరరావు, భాసూరు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

చెస్ పోటీలకు ఏర్పాట్లు చేయండి

పార్వతీపురం, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వచ్చే నెల 13 నుంచి 15 వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎస్.ప్రభాకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రాష్ట్ర స్థాయి చెస్ పోటీలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో 800 మీటర్ల అథ్లెటిక్స్, ఇండో నేపాల్ 800 మీటర్ల అథ్లెటిక్స్‌లో ప్రథమ బహుమతి పొందిన క్రీడాకారులను కలెక్టర్ అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో చెస్ పోటీలకు 486 మంది క్రీడాకారులు హాజరుకానున్నారన్నారు. క్రీడాకారులకు అసౌకర్యం కలగకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.

'అన్నదాత సుఖీభవ'లో వండవ రైతులను చేర్చండి

పార్వతీపురం, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం మండలం వండవ ఇనాం భూములకు చెందిన రైతులకు అన్నదాత సుఖీభవ జాబితాలో చేర్చాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కార్యాలయం అధికారులు స్థానిక కలెక్టర్ కార్యాలయ అధికారులకు సూచించినట్టు సమాచారం. కలెక్టర్ కార్యాయం నుంచి అందుకు సంబంధించిన పూర్తి వివరాలు పంపించినట్టు తెలిసింది. స్థానిక రైతుల సమస్యను ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ.. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకుని వెళ్లడంతో ఆయన కార్యాలయ అధికారులు కలెక్టర్ కార్యాలయ అధికారులతో పాటు వ్యవసాయ శాఖ అధికారుల నుంచి పూర్తి సమాచారం అడిగినటు తెలుస్తోంది.

కూలిన భవనం సన్‌షేడ్

● అంగన్‌వాడీ చిన్నారులకు తప్పిన ప్రమాదం



కూలిన అంగన్‌వాడీ భవనం సన్ షేడ్

సీతంపేట రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పుబ్బాడ పంచాయతీ పరిధిలోని బర్న గ్రామంలోని అంగన్‌వాడీ భవనం సన్ షేడ్ బుధవారం కూలింది. ఆ సమయంలో చిన్నారులు ఇళ్లకు వెళ్లిపోవడంతో వారికి ప్రమాదం తప్పింది. ఈ అంగన్‌వాడీ కేంద్రంలో 10 మంది చిన్నారులు ఉన్నారు. సన్ షేడ్ పెచ్చులు ఊడిపడిన సమయంలో చిన్నారులు అక్కడ లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇక్కడి ఈ భవనం దుస్థితిపై పలుమార్లు అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడంలేదని స్థానికులు తెలిపారు.

40 మందికి క్యాన్సర్ పరీక్షలు

సీతంపేట రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో గురువారం ఏరియా ఆసుపత్రిలో ఉచిత క్యాన్సర్ పరీక్షలను గురువారం నిర్వహించారు. 40మంది మహిళలకు జెమ్స్ వైద్యులు క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు చేపట్టారు. వీరిలో నలుగురిని జెమ్స్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. శిబిరంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయపార్వతి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, జెమ్స్ వైద్యులు మానస, తమయ, కీర్తన, జాన్వి, రేష్మ, ప్రశాంతి పాల్గొన్నారు.

మంత్రి పదవికి రాజీనామా చేయండి

జియ్యమ్మవలస, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా ఉంటూ గిరిజన విద్యార్థుల సంక్షేమం విషయంలో బాధ్యతా రాహిత్యంగా మాట్లాడిన సంధ్యారాణి వెంటనే గిరిజన సమాజానికి, గిరిజన విద్యార్థులకు క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలని మాజీ ఉప ముఖ్య మంత్రి పాముల పుష్పశ్రీవాణి డిమాండ్ చేశారు. గురువారం తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గిరిజన సమాజాన్ని, గిరిజన విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడిన మాటల్లో పూర్తిగా చేతకానితనం, అహంకారం, అంతకు మించి అసమర్థత కనిపిస్తోందన్నారు. విద్యార్థులకు జ్వరాలొస్తే మాది బాధ్యతా..? అంటూ ఆమె మాట్లా డటం దురదృష్టకరమన్నారు. కురుపాం గురుకుల పాఠశాలలో గిరిజన విద్యార్థుల సంక్షేమం, సంరక్షణ మీ బాధ్యత కాదా అని ప్రశ్నించారు. కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి తీరు మరీ దారుణంగా ఉందని మండిపడ్డారు. కార్యక్రమంలో కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, వైస్ ఎంపీపీ జి.సంపత్, జియ్యమ్మవలస మండల కన్వీనర్ రమేశ్ పాల్గొన్నారు.





